గొడ్రాలు

శ్రీమతి సామవేదుల చిరంజీవమ్మగారు

దత్తు చిన్నచదువు చదివినా ఉద్యోగంమాత్రం లభించింది. బ్యాంకి గుమస్తాగా పనిచేస్తూ తల్లిదండ్రులమాట జవదాటక వినయవిధేయతలతో మెలగుతూ ఉండేవాడు. వరలక్ష్మమ్మ ఏకపుత్రుణ్ణి పాతికేళ్ల వాడైనా పసిబిడ్డవలె చూచుకొని హితవు తగవూ గరపుతూ వుంటుంది. తండ్రి కామశాస్త్రిగారి కమీషన్ వ్యాపారం జోరుగా సాగుతూ క్రమంగా ఆపట్నంలో వారు గొప్పవారిండ్లలో పేరుపడ్డారు.

కాంతం కాపరానికి వచ్చి ఐదు సంవత్సరాలయింది. కావలసిన సంబంధమేఅయినా కాంతాన్ని దత్తుకు చేసుకోవటంలో వరలక్ష్మి కేవలం అభిమానంచేత కాకపోయినా అప్పటి తమ స్థితిగతు లాలోచించింది. పిల్లవాని పెండ్లినాటికి కామశాస్త్రిగారిది ఎత్తుడు కాపరమే. అందువల్లనే ఏకపుత్రుడైనా ఉన్నత విద్య చెప్పించలేకపోయారు. ఇప్పుడైశ్వర్యం అబ్బింది.

లేనివారింటిపిల్ల అని కాంతంమీద వరలక్ష్మికి కొంచెం నీరసభావం ఉండేది. కాంతం మరేవిషయంలోను లేనివారింటిపిల్లవలె ఉండదు. బీదవారైనా ఒక్కపిల్ల అవటంచేత అతి సుకుమారంగా కాంతం పెరిగింది. యథోచిత విద్య నేర్చింది. సౌందర్యమే స్త్రీల కలిమిలేములు నిర్ణయించేటట్లయితే కాంతం నిజంగా కలుముల జవరాలని చెప్పవలసిందే! ఆమె విశాలముఖంలో, లావణ్య నేత్రాల్లో, లక్ష్మి తాండవమాడేది. వేలలో ఎన్నదగిన చక్కదనం. ఏపుగాపెరిగి సర్వాంగసుందరిగా ఉన్నదామె! ఆమె పేదవారింటిబిడ్డ యని చూచినవారెవరూ అనుకోరు.

వరలక్ష్మి కోడల్ని లోకసామ్యంగా 'అత్తగారి బాధ'లేవీ పెట్టేదికాదు. కాని ఆమె కాంతాన్ని చూచినప్పుడల్లా ఒకటేవిచారం. ఐదుసంవత్సరాలైనా ఆమెగర్భం యింకా ఫలించలేదని! అదే ఆమె మనస్సుకొక పిచ్చిగాపట్టి కాంతం విషయంలో వైముఖ్యం కలిగించింది. మంచి చీరగాని నగగాని కొనవలసిన సందర్భంవస్తే 'ఆమె కడుపున ఒక కందపుట్టి నాకళ్లపడితే పెట్టిస్తా'నని తోసిపుచ్చేది. కాంతం మనసు చిన్నపుచ్చుకొని మాట్లాడలేకపోయేది. పుట్టింటివారుగాని, అత్తవారుగాని ఏ నగలూ నాణ్యాలు పెట్టకపోయినా సహజ సౌందర్యవతి కావటంచేత ఆమె కేవంకా లేకపోయింది.

ఐశ్వర్యం బాగావృద్ధికావటం, అన్ని హంగులూ కుదిరిఉండటం, మధ్య యీ ఒక్కలోపం కలిగిఉండటం సహించలేక వరలక్ష్మి తోడి అమ్మలక్కలందరితోను ఊసుగా తనకోడలి గొడ్రాలితనాన్ని గురించి వంకరగా మాట్లాడ్డం, కొడుకుముందే కాంతాన్ని వంకరగా ఎత్తిపొడవటం మీరి, చివరకు కొడుకుతో రహస్యంగా కాస్త గట్టిగా ఆమెలోపం తెలియపరుస్తూ వచ్చింది.

మాసములు, సంవత్సరములు గడుస్తున్నాయి. వరలక్ష్మికిమాత్రం మనుమడ్నిఎత్తే ప్రాప్తం లేకపోయింది. కాంతం కాపరానికివచ్చి ఎనిమిది సంవత్సరాలైపోయింది. అత్తగారింక సహించలేకపోయింది. ఆమె సావిట్లో కూర్చొని ఊరి అమ్మలక్కలందరితోనూ రోజూ ఇదే విషయం ఎత్తటం, వారంతా తలోమాట విసరటం, చూచాయగా కొంతవినీ విననట్లు కాంతం మేడమీదకు పోయి తన విచారం మరచేందుకు ఏ సద్గ్రంథమైన చేతపట్టేది.

'నేను చేసిన నేరమేమిటి? నావల్ల వీరంతా పడుతూఉన్న బాధలేమిటి? నాకు బిడ్డలులేకుంటే ఈ వూరివారంతా నరకంలో కూలిపోతారా? నాబాధ వీరందరికీ ఎందుకు? ఎవరికర్మం వారిది. ఇక్కడచేరే

అమ్మలక్కలందరికీ ఇదే ఊసూ! తాము కంటూన్నది చాలదు కాబోలు' దుఃఖంఆగక కన్నీటిచుక్కలు రాలాయి.-తాను గొడ్రాలనికాదు.-వీరంతా చవటాళ్లని! మూర్ఖులని! వారందరినీ మింగేయాలన్నంత కోపం వచ్చేది. కాని పైకేమీ చలించక మామూలుగా ఉండేది కాంతం.

క్రమంగా తల్లిబోధన తలకెక్కింది దత్తుకు! ఆమెచేసిన సిద్ధాంతం నమ్మాడు. కాంతం గొడ్రాలు! తల్లి బలవంతం చేస్తూంది, ఇంకో అమ్మాయినిచూచి చేసికోమని! ముచ్చటగా కాపరంచేస్తూ యిన్నాళ్లూ ఆమెవల్ల అన్ని సౌఖ్యాలు పొందుతూ ఆమెను విడిచి యింకొక భార్యను తెచ్చుకోవటమా? కానిచో యీ తీరని లోపం?

తల్లిపట్టుదల బలవంతమయింది. అప్పుడే పెద్దపెద్దవాళ్లే కబురుతెలిసి పెద్ద కట్నాలిచ్చి పెరిగిన పిల్లల్నిస్తామని చెప్పవస్తున్నారు. వరలక్ష్మి మానసోద్రేకం పట్టతరంకాకుండా ఉంది. కాంతాన్ని ఆఘాళంగా వెళ్లగొట్టి కోరిన కోడల్ని తెచ్చుకొని సంపదనుభవిద్దామని ఉంది ఆమెకు. కాంతం ఆమె ఊహల కన్నిటికి అడ్డుగాఉంది.

కాని దత్తుమాత్రం కాంతంతో తల్లినీ ప్రసంగం తేనీయలేదు. తానే నెమ్మదిగా ఆమెకు తెలియజేయాలని. అత్తగారు ధాటీగా యీకాస్త శుభవర్తమానం ఆమె చెవినివేస్తే ఆమెగుండె పగులుతుందేమో! కాంతం చాలా తెలివైనపిల్ల, పాపం!

ఆరోజు ఆఫీసుకి శలవు. దత్తు భోజనానంతరం తల్లి వీధిసావడిలో గ్రామస్త్రీలసభ నలంకరించే సమయం కనిపెట్టి కాంతాన్ని దగ్గరకు రమ్మన్నాడు. కాంతం ఎంతో ప్రేమగావచ్చి భర్తపాదాల చేరువగా కూర్చుంది ఆకులందిస్తూ. 'కాంతం, మనకెన్నాళ్లీ బిడ్డలులేని కాపరం! ఇంట్లో నువ్వూనేనే పసిబిడ్డలం ఎల్లకాలమూ!' అన్నాడు కాస్త నవ్వుతాలుగా. కాంతానికి మొదట సిగ్గు ముంచేసింది. వెంటనే గుండెలో రాయి పడింది. భర్తకూడా తన్నుగురించి ఏమి భావిస్తున్నాడో! నోరెత్తలేకపోయింది దిగ్భ్రమతో!

'చూడు! మనింటినిండా పాడీపంటా! అన్ని వైభవాలూ యిలా వృథగా పోవటమేనా? నీకే పిల్లలుంటే ఎంత నిండుగా నుండును! ఆప్రాప్తిలేకుంటే మనకీ జన్మకెంత విచారం! నాతల్లీ తండ్రీ ఎన్నాళ్లు సహించగలరు? నే నెన్నాళ్లు సహించగలను?'

కాంతం యింతవరకూ సహించ గలిగింది. మనసులో ఒకవిధమైన ఆందోళన బయలుదేరింది. దాంతో ఒకక్రొత్తధైర్యం వచ్చింది. ఇన్నాళ్లూ తనకిశోర హృదయంలో మననం చేసుకుంటూఉన్న వాదనలన్నీ ఒక్కసారిగా ఒకదాన్నొకటి తోసుకుంటూ ముందుకు వచ్చాయి. పెదవులల్లాడాయి:

'మీరుకూడా యిలాగంటారని అనుకోలేదు! నేనేంచేసేది? ఎవరి అదృష్టం వారిది. నాకేమైన బిడ్డలు కలగడం యిష్టంలేదనా? ఇది నాచేతులోపనా? నా మనసు కెందుకిలా బాధ కలిగిస్తారు?...' దుఃఖోద్రేకంచేత గొంతు తడబడి ఆగింది.

'అది కాదు నేననేది. నిన్నేమీ అనను. నీకు కలగకపోయినా ఇంకొక భార్యకు కలుగుదురు. అందుకోరకు....'

కాంతానికి ఒక్కసారి ఆకాశం విరిగి శిరసున పడింది. ఆ నీలిమాకాశ నిబిడ గర్భంలో ఒదిగియున్న ఉరుమని పిడుగామెకు గూఢంగా వినిపించింది. తన పాదాలక్రింద నేల పరుగిడుతూ వున్నట్లయింది. ఇక పట్టలేకపోయింది. వీరావేశం ధరించింది. రౌద్రరూపధారిణియైన శక్తి స్వరూపం అమరింది.

ప్రకృతి సౌందర్యదేవత! చెలరేగిందా రౌద్రరూపిణి. పిడుగులు కురిపించగలదు. భూకంపం పుట్టించగలదు. ఉప్పెన పెట్టగలదు. ఊళ్లెగురవేయగలదు. ప్రపంచమంతా భస్మం చేయగలదు.

'మీ దురుద్దేశం నాకిప్పుడర్థమైంది! నేను గొడ్రాలినా! నన్నువిడిచి యింకోముద్దరాలిని తెచ్చుకుంటారా? నన్నేగంగలో కలుపుతారు? బిడ్డలులేని బాధ సహించగలను కాని యింత నిరాదరణ, యింత అవమానం, యింత కళంకం సహించగలనా? ఈ దురూహ మీకు పుట్టినదికాదు. మీ తల్లిది. కానిండు. ఇందు నాదోషమేమిటి? మగవారు కాబట్టి నోటికి వచ్చినమాట ఆలోచనలేక అన్నారు కాని జ్ఞానముపయోగించిన యింత అన్యాయం ఉండదు'.........ఏమేమో చెప్పబోయింది. నోరు తిరిగిందికాదు. భోరున ఏడ్చింది.

హిందూస్త్రీ ఎన్నికష్టములైనా, ఎన్ని క్లేశములైనా, ఎన్ని నిందలైనా ఓర్చి భగవంతునిపై భారంవైచి సహిస్తూ శుభదినముల కెదురు చూస్తుంది.

ఆమె మాటల్లో ఏదో దత్తు మనస్సున చురుక్కున నాటింది. అతని ముఖంలో మూర్ఖ స్వభావం గోచరించింది. ఆ ఉద్రేకంతో అతడు ఎదుటివ్యక్తి మనోస్థితి గుర్తించనేరక 'సరే నేనూ చూస్తా. నాతల్లిమాట నాకు అవశ్యం చేయవలసిందే! ఆమె నాకింకొక పిల్లను పెండ్లిచేయ నిశ్చయించింది. నీ విక్కడనుండుటకు నా కభ్యంతరంలేదు. తరవాత నీయిష్టం'అని దిగ్గనలేచి గది గుమ్మంలోపలికి వచ్చాడు.

అంతలోనే వరలక్ష్మమ్మ గబగబా లో గుమ్మంలోనుండి 'నాయనా! నాన్నగారు కాబోలు రాశారు. చదువు' అంటూ ఒకఉత్తరం పట్టుకవచ్చి దత్తుచేతికిచ్చింది. కోడలు కాంతంవేపొక చూపు శరపాతంగా విసిరింది. ఆమె వైఖరిచూచి అంతా గ్రహించి మనస్సులో ఉప్పొంగిపోతూంది!

కొంప మునిగింది! నాన్నగారికి వ్యాపారంలో పెద్దనష్టం కలిగి కుదేలయిందట! 'పదిహేను వేలకుపైగా అప్పులు ఆ వూళ్లోనే ఉన్నవి. కనుక ప్రస్తుతం నేనావూరు వస్తే బాకీదార్ల చేతులోపడి బాధపడవలసివస్తుంది. ఇంటిమీద వారెలాగా జప్తుపెట్టెదరు. మీరెలాగైనా ఆవూరు వదలిపోవలెను. లేకపోతే పెట్టేబేడకూడా దక్కదు.' దత్తు చదువుతూ కన్నీళ్లు కమ్మి కమ్మజారవిడిచి కూలబడ్డాడు. వరలక్ష్మి నడుంవిరిగి హోరున రోదన ప్రారంభించింది. కాంతం తనవిచారం మరచి తెలివితెచ్చుకొని అత్తను భర్తను ఓదార్చటం మొదలుపెట్టింది.

తల్లీ, కొడుకూ, కోడలూ పొన్నూరు చేరుకున్నారు. కాని అంతకుముందే ఇల్లంతా జప్తయింది. కుటుంబం కట్టుబట్టలతో బయటకు నడిచారు పాపం! ఒక చిన్నకొంపలో కష్టంగా కాలక్షేపం జరుగుతూంది. అత్తగారిపైన ఆవంతైనా మనసులో పెట్టుకొనక, కష్టకాలంలో, ఆమెకు, భర్తకు అన్ని ఉపచారాలు చేస్తూంది కాంతం! కామశాస్త్రి ఒకనాడు రహస్యంగావచ్చి అందర్నీ కలుసుకొని జరిగిన దానికి

మొత్తుకొని ఏడ్చాడు. ఇంక యిక్కడనుండీ లాభంలేదు. తాను కాశీ పోతానన్నాడు. భర్తతోకూడా వరలక్ష్మి తానూ వెళ్తానంది. సరే ముసలిదంపతు లిద్దరూ ఆ అవమానం కప్పుకోనేందుకు, కొడుకూ కోడల్నీ దీవించి కాశీ పోయారు.

దత్తుకి దినం జరగటం కష్టమైపోయింది. కాంతం వానికెన్నోవిధాల పరిచర్యచేస్తూ ఉన్నదానితో తాను వస్తున్నా వానికి కష్టం కనపడనిచ్చేదికాదు. ఎంతో ఉత్సాహంగ మాట్లాడి ఎన్నో సుళువులుచెప్పి ఏలాగైనా ఏకూలైనా సంపాదించమని ప్రోద్బలంచేసింది. అతడూ ప్రయత్నిస్తున్నాడు. ఈలోగా తాను పొరుగింటి ప్లీడరుగారి అమ్మాయికి తమ యింటివద్దనే చదువుచెప్తూ వారాదరంగా యిచ్చే 15 రూపాయిల తోనూ భర్తకు ఏవిధమైన లోపంలేకుండా చేసేది.

దత్తు ఆయూరి బట్టల మిల్లులో కూలీగా ప్రవేశించాడు. పెద్దచదువు లేకపోవటంచేత పెద్ద ఉద్యోగం ఏదీ దొరకిందికాదు. రోజల్లా కష్టపడి యింటికివచ్చేసరికి నవ్వుముఖంతో ఎదురుగావచ్చి కాంతం వాని శ్రమంతా తీర్చేసేది. కాయక్లేశం చేత దత్తుకి మంచి ఆరోగ్యం కుదిరింది. ఉదయం మిల్లు గొట్టము కూసేవేళకే కాల్యాలన్నీ తీర్చుకొని భార్య కట్టియుంచిన భోజనం పట్టుకొనిపోయి సాయంకాల మయేసరికి యిల్లు చేరుకొనటం దత్తుకి వాచీపనివలె నిత్యకృత్యం అయిపోయింది. దానితో దినదినం వాని శరీరం కండలుతేరి కాయశరీరం పడింది. కాంతం రోజల్లా కష్టపడి యింట్లోపనులన్నీ చేసి, పొరుగింటి పిల్లకి పాఠాలునేర్పి, యింటిపనులు చూచుకుంటూ, యిల్లలంకరించేసరికి ఆమెకూ ఒక నూతనోత్సాహం, జవం, సత్వం ఏర్పడ్డాయి. ఏకూలైతేనేమి? భార్యాభర్తల అన్యోన్యానురాగానికి, సుఖజీవనానికీ ఆస్వల్ప జీవితమే మూలకందమైపోయింది. ఆపేద గృహానికి అంత ఆనందం, ఉత్సాహం, అలంకారం కల్పించింది కాంతం సౌమనస్యం, ఓర్పు, నిష్కల్మషభావం!

ప్రకృతి ప్రేమ స్వభావ! అడగి మడగి ఉండి కృషిచేసిన కొలదీ సస్యం యిస్తుంది-దివ్యకాంతు లను సృష్టిస్తుంది. పుష్పగంధం విరియిస్తుంది. కమ్మని పండ్లను కానుకలిస్తుంది. తేనెవాన కురియిస్తుంది. దత్తు కాంతాన్ని మరీ ప్రేమతో చూసేవాడు. కష్టించివచ్చిన భర్తను కాంతం మరింతగా ప్రేమించేది. కొన్నా ళ్లకు కాంతం భగవత్కృపవల్ల గర్భం ధరించింది! మగశిశువు కలిగాడు. ఆ అబ్బాయి తల్లిసౌందర్యమంతా ఆ కిశోరరూపంలో ఇముడ్చేసుకొని ఆపేద గృహాని కలంకారదీపంగా వెలిగిపోతూ వున్నాడు. ఇద్దరి ప్రేమ బంధం మరింత దృఢపడినది.

తనతోడి మిల్లుకూలీలు పిల్లలతో వేగలేక ఎందుకీపిల్లలని ఏడ్చేవాళ్లని చూచాడు దత్తు. కాని తనకెందువల్లనో అలా అనిపించేది కాదు.

ఆ శిశుజనన నక్షత్రఫలమో, భగవద్విలాసమో కాని దత్తు చాకచక్యమునకు మెచ్చి మిల్లు మేనేజరు మెచ్చుకొని మెకానిక్‌గా 50 రూపాయిల ఉద్యోగం యిప్పించాడు!